

# జాబులు జవాబులు

డా. పి. రాఘవరెడ్డి,
ఎ.ఎన్.జి.ఆర్.ఎ.యు, రాజేంద్రనగర్.

**ప్ర: వరిలో బి.పి.టి–2448, 2444, 2442 రకాలు బి.పి.టి–5204 కంటే అధిక దిగుబడినిస్తాయని చదివాం. ఈ రకాల గుణగణాలు తెలియచేయండి? విత్తనాలు ఎక్కడ లభిస్తాయి?**

**రెడ్డౌతు రామారావు,** తరకటూరు, కృష్ణాజిల్లా.

జ: ఈ రకాలన్నీ పరిశీలన దశలో ఉన్నాయి. వీటిని ఇంకా పరిశీలించాల్సి ఉంది. ఇవి 140-145 రోజులు, 150-155 రోజుల కాలపరిమితితో గింజ నాణ్యత కలిగి ఉన్నాయి. చిరు ప్రదర్శనలుగా వచ్చి, రైతుల పొలాల్లో పరీక్షింపబడినప్పుడు విత్తనం అందుబాటులోకి వస్తుంది.

**ప్ర: పశుగ్రాసంగా పనికిరాని వరిగడ్డిని దమ్ములో వేసి కలియదున్నితే వరి దిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు నిజమేనా? ఎకరాకు ఎంత వేయాలి? గడ్డి త్వరగా కుళ్లడానికి ఏమి చేయాలి?**

**ఆర్. ఆంజనేయులు,** గొల్లల మామిడాడ, తూ.గో. జిల్లా.

జ: వరిగడ్డిగాని, వరిమొదళ్ల అవశేషాలుగాని పొలంలో కలియదున్నితే దీర్ఘకాలంలో ఉపయోగమే. బాగా కుళ్లేందుకు సూపర్ ఫాస్ఫేట్‌తో పాటు యూరియా 10 కిలోల వరకు ఎకరానికి వేస్తే మంచిది.

**ప్ర: వరిలో కాండందొల్చే పురుగు, దోమపోటు ప్రధాన సమస్యగా ఉంటుంది? వీటి నుంచి పంటను ఎలా దక్కించుకోవాలి?**

**టి. విజయరామారావు,** టి.పి.గూడెం, ప.గో.జిల్లా.

జ: ఈ చీడపీడలను తట్టుకునే రకాల సాగును చేపట్టాలి. సమతుల్యంగా ఎరువుల వాడకం, సక్రమ నీటి యాజమాన్యం పాటించాలి. కాలిబాటలు తీయటంతోపాటు మిత్ర, శత్రు పురుగుల ఉనికిని దృష్టిలో ఉంచుకొని సమగ్ర సస్య రక్షణ చర్యలను సకాలంలో, సమర్థంగా చేపట్టాలి.

**ప్ర: వరికోతకు ముందు మినుము చల్లి తర్వాత యంత్రంతో వరి కోస్తే మినుము పంటకు నష్టం కలుగుతుందా? మినుము దెబ్బ తినకుండా వరికోసే తేలికపాటి యంత్రాన్ని సూచించండి?**

**ఆర్. రామారావు,** విజయవాడ.

జ: మినుము పెరుగుదలను బట్టి యంత్రం బరువుతో కొంతమేరకు నష్టముంటుంది. తేలికపాటి యంత్రాలు ఇంకా అమల్లోకి రావాల్సి ఉంటుంది.

**ప్ర: డి.ఆర్.ఆర్ నుంచి బి.పి.టి–5204కు దీటైన వరి రకం విడుదలైనట్లు చదివాం. ఈ రకం మా జిల్లాలో సాగుకు అనుకూలమేనా? ఈ రకం గుణగణాలు, విత్తనం లభించే చిరునామా సూచించండి?**

**చిన్నూరు సాంబయ్య,** ఎం.కె.పేట, కడపజిల్లా.

జ: ఈ రకం వరి బిపిటి-5204కు అన్ని విషయాల్లో దీటుగా ఉండి, ఎండాకు తెగులును తట్టుకుంటుంది. బిపిటి-5204 సాగుచేసే అన్నిచోట్ల ఈ రకం సాగుకు అనుకూలమే. విత్తనం కోసం వరి పరిశోధనా సంచాలనాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్-500 030 వారిని సంప్రదించగలరు.

**ప్ర: ముందస్తుగా సెప్టెంబరు చివరలో నారు పోసి అక్టోబరులో నాటుకునేందుకు అనువైన రబీ వరి రకాలను సూచించండి? ముందస్తుగా నాటితే చలివల్ల దిగుబడి తగ్గుతుందా? ఏమి జాగ్రత్తలు తీసుకోవాలి?**

**డి. రామాంజనేయులు,** నిజామాబాదు జిల్లా.

జ: చలి ప్రభావం ఉంటుంది గనుక, ముందస్తుగా నాట్లు వేస్తే, తగిన దిగుబడి రాదు. ప్రస్తుతం చలికి కొంతమేరకు తట్టుకునే తెల్లహంస రకం అనుకూలం. నూతన వంగడాలు చిరు ప్రదర్శనలుగా రైతుల పొలాల్లో పరిశీలనలో ఉన్నాయి.

## పారిశ్రామికవేత్త ఆర్.ఎల్. నారాయణరావుకు జాతీయ అవార్డు




**కేంద్ర పరిశ్రమల శాఖ సహాయమంత్రి దిన్షాపటేల్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న ఆర్.ఎల్. నారాయణరావు**

వ్యవసాయ రంగంలో ఎరువులతో పాటు ప్లాంట్ గ్రోత్ ప్రమోటర్స్ ద్వారా అధికోత్పత్తులను సాధించేందుకు అవసరమైన పోషక ఉత్పాదకాలను తయారుచేస్తూ పనితీరులో మంచి నాణ్యతా ప్రమాణాలను పాటించినందుకుగాను 'సౌభాగ్య అమినో ఇన్‌పుట్స్ ప్రైవేట్ లిమిటెడ్' మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.ఎల్. నారాయణరావుకు కేంద్రప్రభుత్వం జాతీయ ఔత్సాహిక పారిశ్రామికవేత్త అవార్డును ప్రదానం చేసింది. నల్గొండ జిల్లా చౌటుప్పల్ ప్రాంతంలోనున్న తన పరిశ్రమలో మొక్క నుంచి తీసిన ప్రొటీన్స్‌ను రీసైక్లింగ్ పద్ధతి ద్వారా పంటలకు అవసరమైన పోషక పదార్థాలను తయారు చేస్తారు. 2009 ఆగస్టు 28న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ సమక్షంలో కేంద్ర పరిశ్రమల శాఖ (ఎం.ఎస్.ఎం.ఇ) సహాయమంత్రి దిన్షాపటేల్ నుంచి ఈ అవార్డును అందుకున్నారు.

నాణ్యత, పనితీరులో రాజీపడకుండా కృషిచేయడంతో తమ కంపెనీకి వరుసగా ఈ అవార్డు వచ్చిందని నారాయణరావు పేర్కొన్నారు. ఇదేకాకుండా 2005 సంవత్సరానికి గాను పర్యావరణ దినోత్సవం సందర్భంగా నల్గొండ జిల్లా పరిధిలో గ్రీన్‌బెల్ట్ డెవలప్‌మెంట్ అవార్డును, 2006కు గాను జిల్లాస్థాయిలో చిన్నతరహా పరిశ్రమలకిచ్చే ఎస్.ఎస్.ఐ. ఎంటర్ ప్రిన్యూర్ అవార్డును, 2007కు గాను రాష్ట్రస్థాయిలో ఇచ్చే స్టేట్ ఫస్ట్ బెస్ట్ ఎంటర్ ప్రిన్యూర్ అవార్డును సైతం ఈ కంపెనీ పొందింది.

**డా. వై. నారాయణరెడ్డి,**
హైదరాబాదు.

**ప్ర: మామిడితోటల్లో మధ్య జనుము అంతర పంటగా వేశాం. పొలంలో దీనిని పచ్చిరొట్టగా కలియదున్నాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

**ఎస్. మల్లికార్జునరావు,**
సదాశివపేట, మెదక్ జిల్లా.

జ: మామిడిలో అంతర పంటగా జనుము వేసివుంటే అది పూత దశకు వచ్చినపుడు, కాండం ముదిరి గట్టిపడక ముందే పచ్చిరొట్టగా కలియదున్నాలి. నేలలో తేమ బాగా వుంటే జనుము త్వరగా కుళ్లుతుంది. కాండం బాగా ముదిరి గట్టిపడిన జనుము కుళ్లడానికి ఎక్కువ రోజులు పట్టి, తక్కువ హ్యూమస్ ఉత్పత్తవుతుంది. అందువల్ల మామిడికి నత్రజని లభ్యత కూడ తగ్గుతుంది.

**ప్ర: నిమ్మ తోటలో పూత, కాపు అధికంగా రావటానికి ఏమి జాగ్రత్తలు చేపట్టాలి. ఎరువుల వాడకం, హార్మోన్ల పిచికారిపై సలహాలివ్వండి?**

**డి. వెంకట్,**
వడిచర్ల, మహబూబ్‌నగర్ జిల్లా.

జ: నిమ్మ చెట్లలో పూత రావడానికి, వాతావరణంలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం, నీటి ఎద్దడి అవసరం. ఇలాంటి అనుకూల పరిస్థితుల్లో ఎరువులు వేసి నీరు ఇస్తే పూత బాగా వస్తుంది. కాపు దశలోని అయిదేళ్లు మించి వయస్సున్న నిమ్మ చెట్లకు 1500 గ్రా. నత్రజని, 600 గ్రా. భాస్వరం, 800 గ్రా. పొటాష్ ఇచ్చే ఎరువులను ఇవ్వాలని ఉద్యానశాఖ సూచిస్తుంది. కాని దేశంలో వివిధ ప్రాంతాల్లో (తిరుపతిలో కూడ) జరిగిన పరిశోధనల్లో, నిమ్మకు 600 గ్రా. నత్రజని, 225-300 గ్రా. భాస్వరం, 450-600 గ్రా. పొటాష్, 7.5-15 కిలోల వేప పిండి, ఇవ్వడంవల్ల ఎక్కువ దిగుబడి వచ్చినట్లు తెలుస్తోంది.

ఈ ఎరువులతో పాటు, సూక్ష్మపోషకాల లోపాలను అరికట్టాలి. ఇందుకు జింక్ సల్ఫేట్ 5 గ్రా. + మెగ్నీషియం సల్ఫేట్ 2 గ్రా. + ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రా. + మాంగనీస్ సల్ఫేట్ 2 గ్రా. + బోరాక్సు 1 గ్రా + సున్నం 6 గ్రా. + యూరియా 10 గ్రా. కలిపిన మిశ్రమాన్ని ఏడాదికి 4 సార్లు పిచికారి చేయాలి.

పూత, పిందె రాలడం అరికట్టడానికి, చెట్లు పూత, పిందె దశలో ఉన్నప్పుడు లోతుగా దున్నటం, తవ్వడం చేయరాదు. పూత సమయంలో 2, 4-డి అనే హార్మోను 1 గ్రా. ముందు కొద్దిపాటి స్పిరిట్/ఆల్కహాల్‌లో కరిగించి, తర్వాత 100 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి. పిందె దశలో మరోసారి పిచికారి చేయాలి. దీనివల్ల పూత, పిందె రాలడం తగ్గుతుంది.

**ప్ర: సపోట, నిమ్మ, బత్తాయిలో గింజలు మొలకెత్తగా వచ్చిన మొలకలను పెరట్లో నాటుకోవచ్చా? దిగుబడి బాగానే వస్తుందా?**

**గరిమెళ్ల రామకృష్ణ,**
విశాఖపట్నం.

జ: పండ్ల చెట్ల విత్తనాల నుంచి వచ్చిన మొలకలు సాధారణంగా తల్లి చెట్టును పోలి ఉండవు. కాయల నాణ్యత, దిగుబడి తక్కువగా ఉంటుంది. ఈ మొక్కలు కాపుకు రావడానికి అంటుకట్టిన మొక్కల కంటే ఎక్కువ కాలం పడుతుంది. అయితే, నిమ్మలో ఒకే విత్తనం

నుంచి ఎక్కువ మొలకలు వస్తే అందులో ఒకటి తప్ప మిగిలినవి తల్లి చెట్టును పోలి ఉంటాయి. వాటిని గుర్తించడం మామూలుగా సాధ్యం కాదు కాబట్టి అంటు మొక్కలను నాటుకోవడం మంచిది.

**ప్ర: మాది బరువైన నల్లనేల. వరికోత తర్వాత జనవరిలో క్యాబేజి, కాలిఫ్లవర్ పంటలు వేయవచ్చా? అనువైన రకాలు, ఆచరించదగు ప్రత్యేక యాజమాన్య పద్ధతులు సూచించండి?**

**పి. చిన్న నాగస్వామి,**
ప్రాతకోట, కర్నూల్ జిల్లా.

జ: క్యాబేజి, కాలిఫ్లవర్ పంటలకు మురుగునీటి పారుదల సదుపాయమున్న, క్షారగుణంలేని, బరువైన నల్లనేలలు కూడా అనుకూలమే. అయితే, ఈ పంటలకు చల్లని తేమగల వాతావరణం చాలా అవసరం. కాలిఫ్లవర్‌లో ఉష్ణోగ్రత 30 డి. సెం.గ్రే. కంటే ఎక్కువైతే మొక్కలో పెరుగుదల ఎక్కువగా ఉండి చిన్నపూత వస్తుంది. పై పంటలను రబీపంటగా అక్టోబరు-నవంబరు నెలల్లో వేసుకుంటే మంచిది. జనవరిలో వేయడం అనుకూలం కాదు.

**ప్ర: 1. తీగజాతి కూరగాయలపై బోరాక్స్, ప్లానోఫిక్స్ పిచికారి చేయవచ్చా? ఎంత మోతాదు వాడాలి?**
**2. జిబ్బరిల్లిక్ యాసిడ్ అన్ని కూరగాయ పంటలపై వాడొచ్చా? ఎందుకు, ఎంత మోతాదులో వాడాలి?**

**ఎం.కె.కె.రెడ్డి,**
మహబూబ్‌నగర్ జిల్లా.

జ: 1. తీగజాతి కూరగాయల్లో, ఆడపూలు ఎక్కువగా రావడానికి మొక్కలు 2-4 ఆకుల దశలో ఉన్నపుడు బోరాక్సు (3 గ్రా./లీటరు నీటికి) లేదా ఎథెరల్ 250 పి.పి.ఎం. ద్రావణం గాని పిచికారి చేయాలి.

2. జిబ్బరిల్లిక్ ఆసిడ్ వల్ల మొక్కల పెరుగుదలలో ఉన్న జీవకణాల విభజన, అవి పొడవుగా సాగుతాయి. ఈ హార్మోన్‌ను సీడ్‌లెస్ ద్రాక్ష రకాల్లో వాటి సైజును పెంచడానికి పిందె పట్టే దశలో వాడతారు. విత్తనం ఉన్న రకాల్లో దీని ప్రభావం ఉండదు. జిబ్బరిల్లిక్ ఆసిడ్‌ను కూరగాయ పంటలపై ఏ ప్రయోజనం ఆశించి ఉపయోగించాలనుకొన్నారో రాసి ఉంటే, అది అవసరమో లేదో చెప్పటానికి వీలయ్యేది.

**ప్ర: టొమాటో తోటలో మొక్కల ఆకులపై తెల్లటి చారలుగా వస్తున్నాయి. ఆకులు ముడుచుకుపోయి, రంధ్రాలు పడి ఉంటున్నాయి. ఈ సమస్యలనెలా అధిగమించాలి?**

**అంజిలమ్మ,** బొంరాస్‌పేట,
మహబూబ్‌నగర్ జిల్లా.

జ: టొమాటో ఆకులపై తెల్లటి చారలు ఏర్పడటానికి లీఫ్ మైనర్ కారణం కావచ్చు. వీటి నివారణకు వేపనూనె 2-3 మి.లీ., లేదా ట్రై అజోఫాస్ 0.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధితో పిచికారి చేయాలి. దీనివల్ల ఆకుముడత వైరస్ తెగులును వ్యాప్తిచేసే కీటకాలు గూడా తగ్గుతాయి.

**ప్ర: వంగతోటలో కొమ్మల చివర్లు వడలి ఎండిపోతున్నాయి. పురుగులేవీ కనిపించడంలేదు. ఎందువల్ల? ఏమి చేయాలి?**

**టి. రమణయ్య,**
అమరావతి, గుంటూరు జిల్లా.

జ: వంగలో మొవ్వ తొలుచు పురుగు ఆశించడంవల్ల కొమ్మల చివరలు వడలి, ఎండిపోతుంటాయి. ఈ పురుగు, కాపుదశలో, కాయలను కూడ తొలుస్తాయి. ఈ పురుగు ఆశించి వాడిన కొమ్మలను కత్తిరించి వేసి లీటరు నీటికి కార్బరిల్ (50 శాతం) 2.5 గ్రా. లేదా మోనోక్రొటోఫాస్ 1.25 మి.లీ. చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**ప్ర: కూర, బూడిద గుమ్మడిలో మేలైన రకాలు సూచించండి? ఎప్పుడు విత్తాలి? ఎకరాకు సుమారుగా ఎంత దిగుబడి వస్తుంది?**

**కృష్ణకుమార్‌రెడ్డి,**
వనపర్తి.

జ: బూడిద గుమ్మడిలో శక్తి, కో-1, కో-2 మేలైన రకాలు. వీటిని జూన్-జులై నెలల్లో గాని, డిసెంబరు-జనవరి నెలల్లోగాని విత్తుకోవచ్చు. బూడిద గుమ్మడిలో సగటు దిగుబడి ఎకరాకు 100-120 క్వింటాళ్లు ఉంటుంది.

డా. ఆర్. సుధాకరరావు,
లాంఫారం, గుంటూరు.

**ప్ర: ఆలస్యంగా ఆగస్టు చివరలో విత్తిన పత్తిలో అధిక దిగుబడి పొందటానికి ప్రత్యేకంగా ఏమి జాగ్రత్తలు తీసుకోవాలి? చీడపీడల ఉధృతిని ఎలా అదుపులో ఉంచాలి?**

**కంతేటి వీరయ్య,**
లేమల్లె, గుంటూరు జిల్లా.

జ: ఆలస్యంగా ఆగస్టు చివరలో విత్తే పత్తిలో అధిక దిగుబడి కోసం సాళ్ల మధ్య దూరం తగ్గించాలి. 90 సెం.మీ. × 45 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. ఎరువులను విత్తిన 20 రోజుల నుంచి 80 రోజుల వరకు 3-4 దఫాలుగా వేసుకోవాలి. ఎరువులను భూమిలో వేయలేని పరిస్థితుల్లో 2 శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేటు ద్రావణం మొక్కలపై పిచికారి చేయాలి.

**ప్ర: బీటీ పత్తిలో కాయలు, ఆకులపై నల్లటి మచ్చలు ఏర్పడి దిగుబడి తగ్గుతుంది. ఈ సీజన్‌లో ఆ సమస్య రాకుండా ఏమి చేయాలి? నాణ్యమైన పత్తి దిగుబడి రావాలంటే ఏమి చేయాలి?**

**బి. రమణరావు,** కర్నూలు జిల్లా.

జ: దీనిని బ్లాక్ ఆర్మ్ తెగులు అంటారు. వర్షాకాలం మబ్బులు పట్టినప్పుడు ఈ తెగులు బాగా వ్యాపిస్తుంది. తెగులు ఉధృతిని బట్టి 15 రోజుల వ్యవధితో 3-4 సార్లు 10 లీటర్ల నీటికి 1 గ్రా. పోషామెసిన్ లేదా ప్లాంటోమైసిన్ + 30 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**ప్ర: 1. మొక్కజొన్న, జొన్న, ఆముదాలు వంటి పంటలు విత్తేటప్పుడు చాళ్లలోనే కోళ్ల ఎరువు (ఎకరాకు వంద కిలోలు) వేస్తే అధిక దిగుబడి వస్తుందని చెబుతున్నారు. నిజమేనా?**
**2. చాళ్లలో కోళ్ల ఎరువుతో పాటు డి.ఎ.పి. కూడా వేయవచ్చా? సలహాలివ్వండి?**

**పి. లక్ష్మణ్**
పూల్‌చర్లకుంట, మహబూబ్‌నగర్ జిల్లా

జ: 1. సేంద్రియ ఎరువులను ఆఖరు దుక్కిలో వేసి కలియ దున్నితే ఎక్కువ ఫలితముంటుంది. విత్తనంతో పాటు కోళ్ల ఎరువు వేసుకుంటే, ఎరువు చివికేటప్పుడు విడుదలయ్యే వేడి, విష వాయువుల వల్ల మొలకశాతం దెబ్బతినే అవకాశముంటుంది.

2. డి.ఎ.పి. లాంటి భాస్వరపు ఎరువులను వీలైనంత వరకు ఆఖరు దుక్కిలో లేదా పంట వేసిన 20-30 రోజుల్లోగా వేసుకోవాలి.

**ప్ర: మొక్కజొన్నలో ఆకు ఎండు తెగులును తట్టుకునే రకాలను సూచించండి? మందుల పిచికారీతో దీనిని నివారించవచ్చా?**

కె. సమ్మారెడ్డి, కరీంనగర్ జిల్లా.

జ: DHM-105, DHM-1 హైబ్రిడ్ రకాలు ఆకు ఎండు తెగులును తట్టుకుంటాయి. ఈ తెగులు నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

**ప్ర: ట్రైకోగ్రామా కార్డులు ఎక్కడ లభిస్తాయి? అన్ని పైర్లలో వీటిని వాడొచ్చా?**

**ఎన్. నారాయణ,**
సంతనూతలపాడు, ప్రకాశం జిల్లా.

జ: జీవ నియంత్రణ ప్రయోగశాల (బయోకంట్రోల్ ల్యాబ్)ల్లో ట్రైకోగ్రామా కార్డులు లభిస్తాయి. మీ ప్రాంత వ్యవసాయాధికారి ద్వారా వీటిని తెప్పించుకునే ఏర్పాటు చేసుకోండి. వివరాలు కూడా వారి వద్ద లభిస్తాయి.

**ప్ర: మందుల పిచికారికి చేతిపంపు, తైవాన్ పవర్ స్ప్రేయర్ల వంటిపరికరాలున్నాయి. వీటితో పిచికారికి ఎకరాకు ఎంత మందు ద్రావణం వాడాలి?**

**టి. మనోహరరావు,**
పరకాల, వరంగల్ జిల్లా

జ: పంట దశను బట్టి చేతిపంపు వాడినప్పుడు ఎకరాకు 100-200 లీటర్ల నీటిని వాడాలి. పవర్, తైవాన్ స్ప్రేయర్లు వాడినప్పుడు నీటి మోతాదును 3 రెట్లు తగ్గించాలి. ఎకరాకు సిఫారసు చేసిన మందు మోతాదులో మార్పు ఉండదు. అంటే పవర్, తైవాన్ స్ప్రేయర్లు వాడేటప్పుడు లీటరు నీటికి వాడే మందు మోతాదు చేతి పంపు కంటే 3 రెట్లు పెంచాలి. ✤